క్లుప్తంగా

మగ్గం, పెయింటింగ్‌పై శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలు

నంద్యాల(అర్బన్): చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మగ్గం, పెయింటింగ్‌పై మహిళలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్లోబల్ కంపాషన్ అమెరికా వారిసహకారం, సంస్థ అధ్యక్షుడు వాసగిరి విజయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ మూడు నెలల పాటు నిర్వహించే కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు మగ్గం, ఫ్రేమ్ అందించనున్నామన్నారు. మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రైనర్ దానమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

గోస్పాడు: ఆరోగ్య జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని గోస్పాడు వైద్యాధికారి కాంతరావునాయక్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అన్ని రకాల ఆరోగ్య, వైద్య సేవలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇందులో 16 రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, 67 రకాల మందుల పంపిణీ, బెడ్ పేషెంట్లుగా ఉన్న వారి ఇళ్లను సందర్శించి సరైన వైద్యంతో పాటు మందులు అందించాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ సేవల్లో నిర్లక్ష్యం తగదని సూచించారు. చిన్నారులకు వ్యాక్సినేషన్లు సకాలంలో వేయించేలా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రన్న కానుక పేరిట అమాయకుల ప్రాణాలు బలి

నంద్యాల(అర్బన్): చంద్రన్న కానుక పేరిట పేద ప్రజల ప్రాణాలు తీయడం విచారకరమని, జనాల ప్రాణాలు తీసే సభల ఏర్పాటు తగదని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనిస్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గుంటూరులో చీరలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామంటూ పెద్ద ప్రచారాలతో పేద ప్రజలను సభలకు తీసుకొచ్చి ప్రాణాలు తీయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీనికి టీడీపీ నాయకులు, నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి సభలు చేపట్టడం సిగ్గుచేటని, ప్రభుత్వం ఇటువంటి సభలకు అనుమతులు ఇవ్వరాదని కోరారు.

రేషన్ వాహనాల ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలి

నంద్యాల(అర్బన్): రేషన్ వాహనాల ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలని ఎండీయూల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా శ్రీనివాసులు కోరారు. వేయింగ్ మిషన్ కాటాల మరమ్మతులకు సంబంధించి మెకానిక్‌ల ఏర్పాటు, వేతనాల పెంపు, చనిపోయిన ఎండీయూ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు డీఎస్‌ఓ ఆచార్యులుకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు రమణ, ఆంథోనిరెడ్డి, గోపాల్, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువకు మోక్షం

నంద్యాల(రూరల్): మండల పరిధిలోని కానాల గ్రామ ఎస్సీ కాలనీలో గత పదేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది.ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు దుర్వాసన భరించలేక, దోమల వల్ల అనారోగ్యం బారిన పడేవారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులు, నాయకుల ఇళ్ల చుట్టు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోయింది. నూతనంగా డ్రైనేజీని నిర్మిస్తే దిగువన ఉండే ఇళ్లలోకి మురుగు నీరు వస్తుందని దిగువ ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో డ్రైనేజీ నిర్మాణానికి ఏ నాయకులు ముందుకు వచ్చేవారు కాదని అ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం సమస్యను గుర్తించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ బావమ్మ తదితరులు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామంలోని ప్రజలతో మాట్లాడి ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎస్సీ కాలనీలోని మురుగు నీరు బయటికి వెళ్లేందుకు పనులు చేపట్టారు. త్వరలోనే డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే, గ్రామ నాయకులకు కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): డిజటల్ విద్యలో రాణించేందుకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని 20వ వార్డు కౌన్సిలర్ మురళీ కోరారు. నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్, ఖలీల్ సిద్దిఖీ హైస్కూల్‌లోని 192 మంది విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్ అమృతరాజు, రహంతుల్లా, దూదేకుల కాశీంలతో కలిసి ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసిందన్నారు. హెచ్‌ఎం చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఊరూ వాడా పింఛన్ల పండుగ

- ఘనంగా పింఛన్ల పంపిణీ వారోత్సవాలు
- మున్సిపల్, మండల పరిధిలో 1050 మందికి నూతన పింఛన్ల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి





నంద్యాలలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, రుద్రవరంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాలలో పింఛన్ల పండగ మొదలైందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. నంద్యాల మున్సిపాలిటీ, మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో పింఛను రావాలంటే జన్మభూమి కమిటీలు, అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయేవారన్నారు. ఆ విధానాలకు స్వస్తి చెబుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు అందిస్తున్నారన్నారు. నంద్యాల మున్సిపాలిటీ, మండల పరిధిలో 1,050 కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. అయితే ఓర్వలేని టీడీపీ నాయకులు పింఛన్లు తొలగిస్తున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా విష ప్రచారం చేయడం సరికాదన్నారు. అనంతరం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకటించి తేదీల వారీగా అమలుచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం రోజుల తరబడి వేచి ఉండేవారని, నేడు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వేకువజామునే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు చెబుతున్న మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పిన ఏ పథకాన్ని అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్‌మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీతఅమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంపీపీ శెట్టిప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు ఇన్‌చార్జులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

గోస్పాడు: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని అమలు చేసి చూపిస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడులో పింఛన్ల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పింఛన్లను విడతల వారీగా పెంచే కార్యక్రమం చేపట్టిందన్నారు. పింఛను సొమ్మును రూ.2750 కు పెంచడంతో పాటు ప్రతినెలా 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి తలుపు కొట్టి పింఛను అందిస్తున్నారని కొనియాడారు. గోస్పాడు మండలంలో 5,600 పింఛన్లు అందుతున్నాయని, ప్రస్తుతం కొత్తగా 169 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు ప్రహ్లాద రెడ్డి, పీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండలాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, రాజు, డీఎల్‌పీఓ జనార్ధన్, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

రుద్రవరం: అన్ని రంగాల్లో ప్రజలను అభివృద్ధి బాట వైపు నడిపిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లో జూలై నుంచి నవంబర్ వరకు 178 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. రుద్రవరానికి చెందిన 37 మందికి కొత్త పింఛన్లు మంజూరు కాగా ఎంపీడీఓ మధుసూధనరెడ్డి మంగళవారం ఎమ్మెల్యే, పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గంగిశెట్టి తిమ్మయ్య చేతుల మీదుగా పంపిణీ చేయించారు.

కానుక మెరిసె.. అవ్వా తాత మురిసె

- పెరిగిన ఫించన్ రూ.2,750 అందజేత
- మండలంలో 88 శాతం పంపిణీ పూర్తి



ఆర్.పాంపల్లెలో వృద్ధురాలు ఆకుల పెద్దలక్ష్మమ్మకు ఫించన్ అందజేస్తున్న సర్పంచ్, వలంటీర్

ఉయ్యాలవాడ: నూతన సంవత్సర కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అవ్వతాతల ఫించన్ మొత్తాన్ని రూ. 2,750లకు పెంచి అందజేస్తుండడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మండలంలో 3,842 మంది పింఛనుదారులకు గాను జనవరి నెల పింఛను రూ.1,05,46,250 విడుదలయ్యింది. ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, అధికారులతో కలిసి 88 శాతం ఫించన్ల పంపిణీ పూర్తి చేశారు. తాము అధికారంలోకి వస్తే ఫించన్ మొత్తాన్ని దశల వారీగా రూ. 3 వేల వరకు పెంచుకుంటూ పోతామని ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం పింఛను మొత్తాన్ని పెంచారు. ప్రస్తుతం మరోసారి రూ. 250 పెంచడంతో మొత్తం రూ.2,750 తీసుకుంటున్న లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గ్రామ సచివాలయాల వారీగా పింఛన్ల వివరాలు

గ్రామ సచివాలయం	మొత్తం ఫించన్లు	మంజూరైన నగదు (రూ.)
అల్లూరు	409	11,20,000
బోడెమ్మనూరు	288	8,05,000
హరివరం	372	10,26,000
ఇంజేడు	424	11,48,750
కొండుపల్లె	360	9,92,000
మాయలూరు	350	9,71,500
పెద్దయమ్మనూరు	238	6,42,750
ఆర్.జంబులదిన్నె	402	11,02,500
సుద్దమల్ల	259	7,16,500
తుడుమలదిన్నె	227	6,25,250
ఉయ్యాలవాడ	513	13,96,000

సీఎంకు రుణపడి ఉంటాం



కొత్త ఏడాదిలో వృద్ధాప్య పింఛను మంజూరు కావడం ఆనందంగా ఉంది. గ్రామ వలంటీర్ ద్వారా సచివాలయంలో పింఛను కోసం గత జూలైలో దరఖాస్తు పెట్టాను. ఇంత తొందరగా పింఛను వస్తుందని ఊహించలేదు. గతంలో పింఛను పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యు ల చుట్టూ తిరగవలసి వచ్చేది. ఇప్పుడు దరఖాస్తులు చే సుకున్న అర్హులందరికీ పింఛను వస్తోంది. పింఛను సకాలంలో అందిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. – తరిగోపుల గోపాల్‌రెడ్డి, ఉయ్యాలవాడ

దివ్యాంగ పింఛను రూ.3 వేలు అందింది



దివ్యాంగురాలినైన నేను ప్రభుత్వ ఆసుపత్రిలో ధ్రువీకరణ పత్రం తీసుకొని వలంటీర్ ద్వారా సచివాలయంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. మూడు నెలలలోపే కొత్త పింఛ ను మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. దివ్యాంగ పింఛను కింద రూ.3 వేలు అందింది. – సిద్ధంరెడ్డి లీలావతమ్మ, కొండుపల్లె

అర్హుల పింఛన్లు తొలగించలేదు



ప్రభుత్వం అర్హులైన వారి ఫించన్లను తొలగించలేదు.మండలానికి కొత్తగా 89 మంది లబ్ధి దారులకు పింఛన్లు మంజూరయ్యాయి. పింఛ న్ల వారోత్సవాల్లో భాగంగా మరో నాలుగు రో జుల్లోపు వంద శాతం పంపిణీ పూర్తి చేస్తాం. – ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ, ఉయ్యాలవాడ

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి
- కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలను వింటూ పర్యటన

ఆళ్లగడ్డ: పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జై కొడుతున్నారని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 9వ వార్డు సచివాలయ పరిధిలోని పృదనాభ వీధి, సత్రం వీధుల్లో పర్యటించారు. ప్రజలను ఆప్యాయతగా పలకరిస్తూ.. వారి సమస్యలను వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేస్తూ ముందుకుసాగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలుస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనతో తాము గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను తలుపు తట్టి అందిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావిస్తున్నామన్నారు. గతంలో పాలించిన చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేయడంతో తగిన బుద్ధి చెప్పారని ఇప్పటికీ తెలుసుకోలేక పోతున్నాడని విమర్శించారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరడాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు నాయకులు సీపీ శ్రీనివాసరెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో తేడా గమనించండి

రుద్రవరం: గత ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి ప్రకటనలకే పరిమితమైంది. ఇప్పటి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 శాతం పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రుద్రవరంలోని రెండవ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీబీటీ విధానంలో ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాల ద్వారా నగదు జమ చేసిందన్నారు. గతంలో ఎన్నడైనా ఇలాంటి పథకాలు పొందారా? గడిచిన మూడున్నరేళ్లలో ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన పథకాలు, లబ్ధిపొందిన నగదు వివరాలను వివరిస్తుంటే లబ్ధిదారులు గడప గడపలో సంబరపడుతున్నారు. ఇంతటి మంచి పథకాలు ప్రవేశపెట్టి ప్రతి పేదకుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకులు ఇళ్ల వద్దకు తిరిగి పథకాలను తీసుకోవాల్సిన దుస్థితి నుంచి మన గడప వద్దకే జగనన్న సంక్షేమ పథకాలను తెచ్చారన్నారు. పుట్లాలమ్మ క్షేత్రం చైర్మన్ మనోహన్‌రెడ్డి, డైరెక్టర్ తిమ్మయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ గంధవ రాఘవరెడ్డి, ఎంపీపీ బాలస్వామి, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, డైరెక్టర్ కృష్ణమూర్తి, నాయకులు ఎర్రం నర్సిరెడ్డి, కొల్లం పుల్లయ్య, మదార్, చంద్రారెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానకు స్థలం ఇప్పించండి

రుద్రవరం: మండల కేంద్రంలో వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, షాదీఖాన నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని ముస్లింలు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి విన్నవించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, గంగుల మనోహర్ రెడ్డి, గంధం రాఘవరెడ్డి, గంగిశెట్టి తిమ్మయ్యలను ముస్లింలు మసీదులోకి ఆహ్వానించి శాలువా, గజమాలతో సత్కరించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి

నంద్యాల(సిటీ): క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ -2023 నంద్యాల జోన్ క్రికెట్ పోటీలను ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలు చరవాణికి అలవాటు పడ్డారని, మైదానంలో ప్రతిరోజూ ఆటలు ఆడితే శారీరక, మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం పోటీలకు హాజరైన క్రీడాకారులను అభినందించారు. సరదాగా బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. విద్యావేత్త డాక్టర్ రామకృష్ణారెడ్డి, హేమంత్ రెడ్డి, సుబ్బయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): రహదారి పక్కన ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న బెన్ని కాంప్లెక్స్ ఏరియా బాధితులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ, సీపీఐ,ఏఐటీయూసీ నాయకులు చింతలయ్య, సోమన్న, శ్రీనివాసులు కోరారు. రహదారి విస్తరణలో భాగంగా బెన్నికాంప్లెక్స్ ఏరియాలో నివాసం ఉంటున్న వారిని ఉన్నఫలంగా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి ఆవాసం కల్పించి ఆ తరువాత ఖాళీ చేయించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సీసీ సతీష్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు.

ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణ బిల్లుకు జాతీయ స్థాయి బీజేపీ నాయకులు కృషి చేయాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుగోపాల్‌లు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వీఆర్‌పీఎస్ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 66 ఏళ్లుగా ఎస్టీ జాబితా బిల్లు పునరుద్ధరణకు నోచుకోక బోయలు వెనుకబాటుతనానికి గురవుతున్నారన్నారు. ఈనెల 8న కర్నూలు జిల్లాకు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ను కలిసేందుకు బీజేపీ నాయకులు వీఆర్‌పీఎస్ నేతలకు అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు శివనాగేంద్ర, పరమేష్, ఓబులేసు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమావేశం

దొర్నిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ నాగేంద్ర ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేప్పుడు తప్పులు లేకుండా చేయాలన్నారు. కుష్ఠు వ్యాధి కేసులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులు, ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంపై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్‌ఓ బాషా ఉన్నారు.

పథకాల అమలుకు ప్రణాళిక



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చి బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్య ప్రణాళిక అధికారి వేణుగోపాల్, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటరామయ్య, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనల్లో ఇచ్చిన 21 హామీలపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, వరద రక్షణ గోడలు, డ్రైనేజీ సిస్టం తదితర పనులపై పటిష్ట ప్రణాళిక రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పనులు చేపట్టేందుకు అవసరమైన అనుమతులు తీసుకొని నిర్ణీత కాల వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీ రాజ్ ఎస్‌ఈ రామ్మోహన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సురేష్, ఇరిగేషన్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

‘ఫిట్ ఇండియా’ను జయప్రదం చేయాలి

నంద్యాల(సిటీ): రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఫిట్‌నెస్ ఇండియా స్కూల్ వీక్‌ను జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల రోజువారి ఫిట్‌నెస్ ప్రాముఖ్యతను తెలియజేసే కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలను కింద పేర్కొన్న గూగుల్ ఫామ్ https://form.gle/Qj6znz2T8H3trKu86 లో పొందుపరచాలని సూచించారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి



టీ.లింగందిన్నెలో సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రుద్రవరం: రీసర్వే పక్కాగా నిర్వహించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. టీ.లింగదిన్నెలో గత కొద్ది రోజులుగా సాగుతున్న రీసర్వే పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. రైతుల సమక్షంలో భూమి కొలతలు వేస్తూ హద్దు రాళ్లు పాతించాలన్నారు. అనంతరం నర్సాపురంలో హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వభూమి లేకపోవడంతో రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ గ్రామంలోని సర్వే నంబర్లు 434, 435లోని భూమిని పరిశీలించారు. తహసీల్దారు వెంకటశివ ఉన్నారు.

శిరివెళ్ల: మహదేవపురంలో పేదల ఇళ్లస్థలాల కోసం ఆర్డీఓ శ్రీనివాసులు భూమిని పరిశీలించారు. రైతు లక్ష్మి ప్రియాంకకు చెందిన 340 సర్వే నంబర్‌లోని 2.15 ఎకరాల భూమిని ఆయన పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామంలో 70 మంది పేదలు ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్నారని వారందరికీ జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, వీఆర్‌ఓ బాబు, సర్పంచ్ పెద్ది రమణయ్య, తదితరులు ఉన్నారు.

ముగిసిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



పుష్పాలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మంగళవారం ద్వాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు నిఖిలేశ్వర శర్మ, బాలాజీ మహిళా మండలి ఆధ్వర్యంలో స్వామి వారికి వివిధ రకాల పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సంజీవనగర్ రామాలయంలో కూర్మావతారంలో ఉన్న వేంకటేశ్వరస్వామికి శ్రీభగవత్ సేవా సమాజ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్లరసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 6వ తేదీన పల్లకి సేవలు ప్రారంభించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ లక్ష్మినారాయణ, అంబరీష్ తెలిపారు. అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు ఆద్యులు సావిత్రీబాయి పూలే



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీదేవి



నర్సాపురంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే నిరంతరం కృషి చేశారని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీదేవి కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక బీసీ వసతి గృహం ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

రుద్రవరం: నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏంఈఓ వెంకట్రామిరెడ్డి, హెచ్‌ఎం విజయకుమార్ సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

నంద్యాల(సిటీ): స్థానిక డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి మాట్లాడుతూ చదువుల తల్లి, సామాజిక కార్యకర్త, భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే సేవలు ఎనలేనివన్నారు. మహిళా సాధికారత కన్వీనర్ శిరోమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): మహిళల విద్యాభివృద్ధికి పాటుపడిన సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని నంద్యాల జిల్లా బీసీ సంఘం గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రమణయ్యగౌడ్, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.